యువగళం విజయోత్సవ సభ విజయవంతం చేయాలి

మాజీ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి

విశాలాంధ్ర-నరసన్నపేట : ఈనెల 20వ తేదీన విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలోని పోలిపల్లి గ్రామంలో ముగియనున్న యువగళం పాదయాత్ర సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతూ యువగళం సభ నేపథ్యంలో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధిక సంఖ్యలో జన సమీకరణ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు, మ(రెడ్డి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి, జల్లు చంద్రమౌళి, టిడిపి కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

స్కంద షష్ఠికి ముస్తాబైన శ్రీ సుబ్రహ్మణ్య ఆలయం

విశాలాంధ్ర-నరసన్నపేట : మండలంలో గొట్టిపల్లి గ్రామ సమీపంలో వున్న శ్రీ సుబ్రహ్మణ్య ఆలయం స్కంద షష్ఠికి ముస్తాబయ్యింది. ఈ విషయమై ఆలయ అర్చకులు, వసనాభి మోహనరావు శనివారం మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన స్కంద షష్ఠి సంధర్భంగా శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామివారి దేవాలయంలో స్వామివారికి ఆరాధన, అర్చన, అభిషేకములు చేసినచో విశేష ఫలితం లభిస్తుందని, విద్య, ఉద్యోగం, వివాహం, వ్యాపారం, శత్రు నాశనం, సర్వ ఆటంకములు తొలుగునని తెలిపారు. అంతేకాకుండా సమస్త కుజ దోషములు, కాలసర్ప దోషములు, గ్రహ దోషములు నివారణ అగునని అన్నారు. సుబ్రహ్మణ్య షష్ఠి సంధర్భంగా భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామివారి తీర్థప్రసాదాలు పొంది, స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ అర్చకులు, వసనాభి మోహనరావు కోరారు.

జనసేనలోకి కోత

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు శనివారం మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ అభ్యర్థిగా పలాస నియోజక వర్గంలో పోటీ చేసిన కోత అనంతరం 2020లో మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సమక్షంలో వైసీపీలో చేరారు. గత మూడేళ్లుగా పార్టీలో సముచిత స్థానం కల్పించకపోవడంతో ఆ పార్టీకి దూరమయ్యారు. ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఈనెల 14వ తేదీన పలాస వచ్చిన సందర్భంగా కిడ్నీ ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కోత ఆ మరుసటిరోజు జనసేన పార్టీలో చేరడం ఈ ప్రాంతంలో చర్చనీయాంశమైంది. తెలుగుదేశం హయాంలో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్‌గా వ్యవహరించిన కోత మున్సిపాలిటీ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారు. ప్రస్తుతం జనసేన-టీడీపీ ఉమ్మడిగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తుండడంతో తెలుగుదేశం అభ్యర్థి విజయానికి కృషి చేస్తామని కోత తెలిపారు. లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర సందర్భంగా శనివారం పార్టీ నాయకులు విజయకుమార్ ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా మొరపాక వద్ద పాదయాత్రలో పాల్గొన్నారు.

జిల్లా వైకాపా జనరల్ సెక్రటరీగా వజ్జ కృష్ణ

విశాలాంధ్ర-సోంపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రటరీగా వజ్జ కృష్ణారావు నియమితులయ్యారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం ఉత్సాహంగా పని చేస్తూ యువతను పార్టీ వైపు ఆకర్షించేలా కార్యక్రమాలను నిర్వహిస్తున్న కృష్ణారావుకు పదవి పట్ల ఈ ప్రాంతీయులు హర్షం వ్యక్తం చేశారు. పదవీ బాధ్యతలు అప్పగించి నందుకు కృషి చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఇచ్ఛాపురం ఇన్‌చార్జ్ పిరియా సాయిరాజ్, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసులకు కృష్ణారావు కృతజ్ఞతలు తెలిపారు.

అరబిందో ఉద్యోగుల రక్తదానం

విశాలాంధ్ర-రణస్థలం : అరబిందో ఫార్మా ఫౌండేషన్ సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా ఎపిటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్, యూనిట్-4 ఉద్యోగులు మరియు కార్మికులు సామాజిక సేవా బాధ్యతలో భాగంగా 200 మంది మించి రక్తదానం చేసారు. ఈ సేవా కార్యక్రమం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ - రక్త నిధులు కేంద్రం మరియు హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు వారి ఆధ్వర్యం లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ఎపిటోరియా ఫార్మా అనగా అరబిందో ఫార్మా ఉద్యోగులు మరియు కార్మికులు రక్త దానం కోసం ఉత్సహంతో పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగులు పెన్ డౌన్

విశాలాంధ్ర -ఆముదాలవలస... ఎస్ఎస్ఎ ఉద్యోగులు నిరసన కార్యక్రమాల్లో భాగంగా శనివారం నుంచి పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర, జిల్లా సమగ్ర శిక్ష జేఏసీ పిలుపు మేరకు ఉద్యోగుల డిమాండ్స్ సాధన కోసం (ఉద్యోగ భద్రత, పెండింగ్ జీతాలు తక్షణమే విడుదల చేయా లని) శనివారం ఆమదాలవలస ఎం ఆర్ సి కార్యాలయం ఎదుట పెన్‌డౌన్ చేసి నిరసన వ్యక్తం చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల పెండింగ్ జీతాలను తక్షణం విడుదల చేయాలని నినాదాలు చేశారు. 20వ తేదీ వరకు పెన్ డౌన్ కార్యక్రమం నిర్వహిస్తామని అప్పటికి ప్రభుత్వం ముందుకు రాకుంటే 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలో పాల్గొంటా మన్నా రు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఉన్న తాధికారులకు సమ్మె నోటీసులు అందించా మని వివరించారు. ఈ కార్యక్రమంలో బొడ్డే పల్లి నరసింగరావు, ఎం.వి.రమణ, శ్రీను, శైలజ, జ్యోతి, చంద్రకళ, ధనలక్ష్మి, శ్రీను, ప్రసాద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతిని కుటుంభానికి ఆర్థిక చేయూత

విశాలాంధ్ర-రణస్థలం : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి కుటుంబానికి అండగా నిలిచి ప్రమాద ఇన్సురెన్స్ వచ్చేలా చేసి ఆ సోమ్మును శనివారం మృతుని కుటుంబానికి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షులు, రాష్ట్ర సర్పంచుల సంఘం ఆర్గనైజేషన్ సెక్రెటరీ రణస్థలం సర్పంచ్ పిన్నింటి వెంకట భానోజీ నాయుడు అందించారు. మండలంలోని క్రిష్ణాపురం గ్రామానికి చెందిన గొర్లె ఆదినారాయణ ఆరు మాసాలక్రితం రణస్థలం జాతీయ రహదారిపై కారు డీకొని మరణించారు. ఈ పరిస్థితుల్లో ఏమి చేయాలో తెలయక ఉన్న ఆ కుటుంబానికి బాసటగా నిలిచిన భానోజీనాయుడు యాక్సిడెంట్ చేసి పరారీలో ఉన్న కారు ఆచూకి తెలుసుకుని కారు యజమానితో మూడు లక్షల రూపాయలు ఆర్థిసహాయం అందించడమే కాకుండా కారుకి ఉన్న ఇన్సూరెన్స్ వచ్చేలా చేసి ఆకుటుంబాని రూ. 11లక్షలు ఇన్స్యూరెన్స్ సంస్థ ఇచ్చిన చెక్కులను గ్రామస్థుల సమక్షంలో మృతుని కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కెల్ల హేమంత్, నడుపూరి శ్రీను,నడుపూరి రామారావు, గొర్లె అప్పలనాయుడు, పిన్నింటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలు వినూత్న నిరసన

విశాలాంధ్ర -ఆముదాలవలస... ఐదు రోజులుగా నిరవధిక సమ్మెలో పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు శనివారం వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. నల్ల రిబ్బను కట్టుకొని ప్రభుత్వ చర్యలకు వ్యతిరే కంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం వారి కేంద్రాల పరిధిలోని లబ్ధిదారులు సభ్యులను చిన్న పిల్లలతోపాటు తీసుకొని నిరసన కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. చిన్నారులు కూడా మూతికి నల్ల రిబ్బను కట్టుకొని నిరసన తెలిపారు. ఈ విషయమై యూనియన్ ప్రతినిధులు మాట్లా డుతూ ప్రభుత్వం దుందుడుకు చర్యలకు పాల్గొంటుందని కేంద్రాల తాళాలు పగులు కొట్టి మా ఐకృత పై దెబ్బతీస్తుందని విమ ర్శించారు. రికార్డులు ప్రాప్తికి స్టాక్ లేకపోతే యూనియన్ నాయకుల నిర్ణయం మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నామని తెలిపారు. ముందుగా అంగన్వాడీలకు మద్దతు ప్రకటించి తిరిగి వెళుతున్న సమ యంలో ఎమ్మెల్సీ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన తమను బాధించిందని తెలిపారు. ఆయన చిత్రపటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. ఈ కార్య క్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర-పలాస: కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు చేపడుతున్న నిరసన ధర్నా శనివారంతో 5వ రోజుకు చేరుకుంది. అంగన్వాడీ కార్యకర్తలు కాశీబుగ్గ ఐసిడిఎస్ కార్యాలయం నుంచి కె.టి రోడ్డు మీదుగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ధర్నాకు జీడి రైతు సంఘం జిల్లా కన్వీనరు తెప్పల అజయ్‌కుమార్, పుక్కల గురయ్య, బైపల్లి రామకృష్ణ, ఎ.పి ఎన్.జి.వో సంఘం నాయకులు బోనెల గోపాల్, బి.ఓంకార్, శ్రీనివాసరావు, పివోడబ్ల్యు జిల్లా కార్యదర్శి పోతనపల్లి కుసుమ, కృష్ణవేణి, ఎఐసిసిటియు నాయకులు దున్న శ్రీనివాసరావులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఎస్.గణపతి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.5లక్షల విలువైన అద్దాలు పంపిణీ

విశాలాంధ్ర-సోంపేట : సోంపేట రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో అద్దాల కోసం గుర్తించిన 500 మంది రోగులకు 5లక్షల రూపాయల విలువైన కళ్లద్దాలను శనివారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు, కార్యదర్శి కృష్ణారావు ఆధ్వర్యంలో కళ్లద్దాలను ఉచితంగా పంపిణీ చేశారు. సోంపేట ఆరోగ్యవరం ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఈ శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఇటువంటి మెగా క్యాంపు నిర్వహించడం అందుకు తగ్గట్లుగా రోగులు శిబిరానికి వచ్చే విధంగా కృషి చేయడం అభినందనీయమని అన్నారు. లక్షలాది రూపాయల విలువైన కళ్లద్దాలు, కంటి ఆపరేషన్లు నిర్వహించడం ద్వారా సోంపేట రోటరీక్లబ్ తమ సేవా భావాన్ని చిత్తశుద్ధిని, అంకితభావాన్ని చాటుకుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, మోహనరావు, వెంకటరమణ, బెనర్జీ, జగన్మోహన్‌రావు, గోవింద రావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని డి.గొనపపుట్టుగ గ్రామంలో రాబోయే సంక్రాంతి సందర్భంగా జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు శ్రీప్రతిభ యువజన సంఘ సభ్యులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.ఈనెల 20వ తేదీ నుంచి జనవరి 01వ తేదీలోగా ఆసక్తి గల టీంలు తమ పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి 20 వేల రూపాయలతోపాటు ట్రోఫీ,ద్వితీయ బహుమతి,12 వేలు రూపాయలతోపాటు ట్రోఫీ అందజేయబడుతుందని తెలిపారు. మరిన్ని వివరా లకు 7093109849, 90148 87374 మొబైల్ నెంబర్లకు సంప్రదించవలసినదిగా కోరారు.

ఎస్ఐ గణేష్‌కు కమోడేషన్ డిస్క్ అవార్డు

విశాలాంధ్ర-అరసవల్లి : వన్‌టౌన్ ఎస్ఐ బలివాడ గణేష్‌కి డీజీపీ కమోడేషన్ డిస్క్ అవార్డు లభించింది. ఈమేరకు శనివారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి చేతులమీదుగా గణేష్ ఈ అవార్డును అందుకున్నారు. గతంలో కూడా గణేష్‌కి డీజీపీ కమోడేషన్ డిస్క్ అవార్డు లభించింది. పోలీసు శాఖలో ఈ అవార్డుకు ప్రత్యేకమైన స్థానం ఉంది. ముక్కుసూటి తత్వం, నిజాయితీగా పనిచేయడం, ఎటువంటి ఒత్తిళ్లకు తలొగ్గకపోవడం గణేష్ లో కనిపించే లక్షణాలు. వృత్తి పరంగా ఏ పనిని అప్పగించినా సకాలంలో పూర్తిచేసే సమర్థుడు గణేష్, దీనిని గుర్తించిన పోలీసు ఉన్నతాధికారులు ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డు పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

జగనన్నకు పాలాభిషేకం

విశాలాంధ్ర-కొత్తూరు : వంశధార ప్రాజెక్ట్ నిర్వాసితులకు ప్రభుత్వం చెల్లించవల సియున్న పరిహారం పెండింగ్ నిధులను విడుదలచేసి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతల్లో వేసిందందుకు ఎమ్మెల్యే శాంతి అధ్వర్యంలో శనివారం గూనబద్ర మండలం ఆర్అండ్ ఆర్‌కాలనీలో నిర్వాసితుల ఏర్పాటుచేసిన సభలో సీఎం జగన్మో మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. స్థానిక సర్పంచ్ పెద్దకోట సాధుబాబు ,గున బద్ర సర్పంచ్ కే.వాణీ, పియేసియేస్ ఛైర్మెన్ చింతాడ సూర్యనారాయణ. మెట్టూరు బిట్ 2 సర్పంచ్ ఏర్లంకి ధర్మారావు వైసీపీ నాయకులు కే.వై.కుంటరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులలో శాస్త్రీయ వైఖరి పెంపొందించాలి : ఎంఈఓ చిన్నవాడు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : విద్యార్థులలో విజ్ఞానశాస్త్ర బోధన ద్వారా శాస్త్రీయ వైఖరి, తార్కిక ఆలోచన పెంపొందించాలని మండల విద్యాశాఖాధి కారి జలుమూరు చిన్నవాడు అన్నారు. బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విజ్ఞాన శాస్త్ర ప్రదర్శన ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగింది. ఈప్రదర్శనలో మండలంలోని సంతబొమ్మాలి, బోరుభద్ర, కొల్లిపాడు, పాత మేఘవరం, నౌపడా, వల్లేవలస, జగన్నాధ పురం ఉన్నత పాఠశాలలు, సవరపేట, పాలతలగాం, కారిపేట, ఎం.సున్నాపల్లి, గోదలాం ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూ నాలు, ఆవిష్కరణలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్ర అధ్యయనం మూఢ నమ్మకాలు పారద్రోలి విజ్ఞానవంతులను చేస్తుందని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,బోరుభద్ర మండలస్థాయి ప్రధమ స్థానం పొందగా, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, నౌపడా ద్వితీయ స్థానం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సంతబొమ్మాలి తృతీయస్థానంలో నిలిచాయి. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బరాటం కామరాజు, మెట్ట రామారావు, భాస్కరరావు, ఉపాధ్యాయులు టీ.లోకేశ్వర రావు, ఏ. వెంకటరెడ్డి, ఉమా శంకర్, బాడాన రాజు, డి.ఉమాదేవి, టీ.విజయలక్ష్మి, బి.నాగమణి, తవిటిరెడ్డి, శ్రీనివాస రావు, తిరుపతిరావు, శంకరరావు, దుర్యోధన, అసిరి నాయుడు, శివాని పాల్గొన్నారు.

భూకబ్జాలకు పాల్పడినవారిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- డిపట్టా భూ బాధితులు ఫిర్యాదు
- దళిత, ప్రజా సంఘాలు డిమాండ్

విశాలాంధ్ర-ఇచ్ఛాపురం : మండలంలోని ఈదుపురం రెవెన్యూ గ్రామంలో ల్యాండ్ సీలింగ్ భూమికి దళితులకు ప్రభుత్వం ఇచ్చిన డి పట్టా భూమిని కబ్జా చేయుటకు పూనుకుంటున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దళిత, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఇచ్ఛాపురం రూరల్ పోలీస్‌స్టేషన్, మండల తహశీల్దార్, పలాస ఆర్డీఓ కార్యాలయం అధికారులకు పిర్యాదు చేశారు. బాధిత కుటుంబ సభ్యులు దోప ఎస్తేరు, దోప ఎరవయ్యలు సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక జిల్లా అధ్యక్షుడు అనపాన షణ్ముఖ రావు, దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పాల పోలా రావు,జిల్లా నాయకులు చిట్టి సింహాచలం, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఉప్పాడ సూర్యనారాయణ, ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు చుక్క రాము, మత్స్యకార్మిక సంఘం నాయకులు నాగుల తవుడులు ఆధ్వర్యంలో పిర్యాదు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. దోప ఎస్తేరు తండ్రి బందారు జేమ్స్‌కు ఈదుపురం రెవెన్యూ గ్రామంలో సర్వే నెంబరు 399-పిలో విస్తీర్ణం 0.30 సెంట్లు భూమిని ఫిబ్రవరి7, 1986లో ప్రభుత్వం వారు ల్యాండ్ సీలింగ్ భూమికి డిపట్టా అందించారని తెలిపారు. నాటి నుండి డిపట్టా భూమి జేమ్స్ కుటుంబ సభ్యుల సంపూర్ణ స్వాధీన అనుభవంలో ఉన్నదని వివరించారు. ప్రభుత్వం దళితులకు ఇచ్చిన డిపట్టా భూమి క్రయవిక్రయాలకు వీలుపడదని అన్నారు. ఈ భూమిపై వివాదం జరుగగా ఏప్రిల్ 8, 2023న రూరల్ పోలీసులు ఎఫ్.ఐ.ఆర్.31/2023 నమోదు చేశారని, రెవెన్యూ అధికారులు తప్పుడు నివేదికలు ఇచ్చి అట్రాసిటీ కేసు నీరుగార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మిన్ స్టేషన్ అమరావతి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పిర్యాదు చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికా రులకు పిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారుల్లో చలనం లేదన్నారు. మరలా ఇటీవల ఆ స్థలంలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని భాదితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి చట్టపరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పేదలకు ఉపాధ్యాయుడు ఆనందరావు దుప్పట్లు పంపిణీ

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాలి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు గా విధులు నిర్వహిస్తున్న కానూరు ఆనందరావు స్వంత డబ్బులుతో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వ హించిన అనంతరం పాటశాల అభివృద్ధి పై చర్చించారు. ఈ సమావేశానికి మండల విద్యాశాఖ అధికారి జె.చిన్నవాడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అంగూరు రామారావు మాట్లాడుతూ, పాఠశాల ప్రగతి మధ్యాహ్న భోజన పథకం ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు పాఠశాలలో నిర్వహించబడిన వివిధ కార్యక్రమాలు గూర్చి తల్లిదండ్రులకు వివరించారు. మండల విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ పాఠశాల విద్యా ప్రగతి మధ్యాహ్న భోజన పథక తీరు ఉపాధ్యాయ విద్యార్థుల హాజరు పాఠశాల పనితీరు చక్కగా ఉందని ఉపాధ్యాయులు ఆనందరావు తన సొంత డబ్బులతో దుప్పట్లు వితరణ చేయడం చాలా ఆనందదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంతబొమ్మాలి సర్పంచ్ ప్రతినిధి అప్పారావు, ఎంపీటీసీ ప్రతినిధి దూబ వేణు కాంప్లెక్స్ చైర్మన్ కామరాజు, ఉపాధ్యా యులు లఖినాన వెంకటరమణ, నరసింహమూర్తి, హరిప్రసాద్, సిమ్మన్న, మయూరి, రోజా రమణి, భవాని, రజిని మరియు పావని పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ పరేడ్‌కు డా. బిఆర్ఏయూ విద్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : న్యూఢిల్లీలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జరిగే పరేడ్‌లో పాల్గొనేందుకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం విద్యార్థిని బమ్మిడి రంజనికి ఆహ్వానం లభించింది. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ నాలుగో సంవత్సరం ప్రస్తుతం రంజని చదువుతున్నది. ఈ పరేడ్‌లో పాల్గొనేందుకుగాను రంజని ఈ నెల 29న ఢిల్లీ బయిలదేరి వెళ్లనున్నారు. పరేడ్ రిహార్సల్స్‌ల్లో దాదాపు నెలరోజులు పాటు పాల్గొని పూర్తిస్థాయి పరేడ్‌కు జనవరి 26న హాజరు కానున్నారు. తర్వాత రాష్ట్రపతి, ప్రధాని మంత్రి తదితరులతో ఫోటో సెషన్, హై-టీలో పాల్గోనున్నారు. కాగా రాష్ట్రం నుంచి గణతంత్ర పరేడ్‌లో పాల్గొనేందుకు పది మంది విద్యార్థులకు ఆహ్వానం రాగా అందులో రంజని ఒకరు. విజయవాడలో జరిగిన వెస్ట్ జోన్ పరిధి రాష్ట్రా లయిన మహారాష్ట్ర, గోవా, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, గుజరాత్, డైయూ అండ్ డామన్ తదితర ప్రాంతాల నుంచి దాదాపు 200 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్‌లు హాజరుకాగా ఆంధ్రప్రదేశ్ నుంచి పదిమందిని(వెస్ట్ జోన్ రాష్ట్రాల నుంచి మొత్తంగా 40 మందిని)ఈ పరేడ్ కు ఎంపిక చేశారు. మరోవైపు ఈ ఏడాది ఆగష్టులో ఢిల్లీ దర్శన్ పేరిట జరిగిన పార్లమెంట్ విజిట్‌లో కూడా రంజని పాల్గొన్నారు. గత ఏడాది నవంబర్‌లో హర్యానా రాష్ట్రంలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో కూడా డాక్టర్ బిఆర్ఏయూ తరపున పాల్గొని బెస్ట్ ఎన్‌సిసి వలంటీర్‌గా ఎంపికయ్యారు. గత ఏడాది డిసెంబర్‌లో భువనేశ్వర్‌లో జరిగిన అఖిలభారత అంతర్ విశ్వ విద్యాలయాల యోగ పోటీలో కూడా రంజిని పాల్గొన్నారు. రంజిని స్వస్థలం ఈజిల్లాలోని నందిగామ మండలం ఆనందపురం గ్రామం. కాగా, బమ్మిడి రంజనికు, ఈ పరేడ్‌లో పాల్గొ నేందుకు ఆహ్వానం లభించడంపట్ల డా.బిఆర్ఏయూ వైస్-ఛాన్సలర్ ఆచార్య నిమ్మ వెంకటరావు ఈసందర్భంగా శనివారం అభినందించారు. ఈకార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సిహెచ్. ఎ.రాజేంద్రప్రసాద్, వర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం. అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఖాదీ వస్త్ర పరిశ్రమ అభివృద్ధే సర్కార్ ధ్యేయం : స్పీకర్ తమ్మినేని

విశాలాంధ్ర-పొందూరు : ఖండాంతర ఘన కీర్తి ప్రతిష్టలు నిలపడంలో కీలకంగా నిలిచిందని ఖాదీ వస్త్రా పరిశ్రమ అభివృద్దే ధ్యేయం సర్కార్ పనిచేస్తుందని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. వైఎస్ఆర్ లైఫ్ ఎచీవ్ మెంట్ అవార్డు ద్వారా వచ్చిన 10 లక్షల ఆదాయంతో ఖాదీ బండార్ ఆవరణలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ను సభాపతి తమ్మినేని సీతారాం శనివారం ప్రారం భించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతిపిత మహాత్మా గాంధీ నుండి అగ్రరాజ్యం అమెరికా అధినేత బిల్ క్లింటన్ ఎంతగానో నచ్చిన ఖద్దరు వస్త్రాలు అన్నివర్గాల ప్రధానికానికి ప్రీతిపాత్రమైనవన్నారు. కొన్ని దశాబ్దుల కాలంగా వందలాది కుటుంబాలు వస్త్ర పరిశ్రమను నమ్ముకుని జీవనం సాగిస్తున్నా యన్నారు. ఖాది వస్త్ర పరిశ్రమకు పూర్తిస్థాయిలో సహకారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పొందూరులో మినీ ఖాదీ క్లస్టర్ ఏర్పాటు ఆవశ్యకతను చేనేత జౌళ్ళ మంత్రిత్వ శాఖకు, ఉన్నతాధికారులకు పలు సందర్భాల్లో వివరించా నన్నారు. చేనేత కార్మికులకు న్యాయం జరిగేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నానన్నారు. మినీ క్లస్టర్ ప్రాజెక్టు వలన చేనేత కార్మికులకు చేనేత(వీవింగ్), డయింగ్ /డిజైనింగ్, ఐటి/మేనేజీరియల్ రంగాల్లో పూర్తి స్థాయిలో శిక్షణ లభించనుందన్నారు.. శిక్షణా కాలంలో రోజుకు 300 రూపాయలు స్టైపెండ్ కూడా లభించ నుందన్నారు. "సమర్థ" పథకం క్రింద నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం జరుగనుందని తెలిపారు. దీనివలన మగ్గాలు,ఆధునిక పరికరాలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తాయన్నారు.మార్కెట్లో డిమాండ్ ఉన్న వస్త్రాల వివరాలు,తదితర సమాచారం తెలుసుకునే వీలు ఉంటుందన్నారు. ఆధునిక డిజైన్లను ఆవిష్క రించేందుకు డిజైన్ డెవలప్మెంట్ అధికారిని నియామకం జరుగనుందని తెలిపారు..వీటన్నిటితో వేతనాలు పెరుగుదల వచ్చి ఆర్థికంగా, సామాజి కంగా చేనేతకారులకు ఉపయోగపడనుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర, జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌లలో పాల్గొనే అవకాశాలు పెరుగుతూనే, సమగ్రమైన అభివృద్ధికి సహకారం అందే అవకాశాలు ఏర్పడతాయని సభాపతి వివరించారు. ఆమదాలవలస నియోజకవర్గంలో చేనేత వస్త్ర పరిశ్రమను నమ్ముకున్న కార్మికుల ప్రయోజనార్థం అవసరమైన చోట్ల క్లస్టర్ల యూనిట్లు ఏర్పాటుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా సభాపతి స్పష్టం చేశారు. నేతన్న నేస్తం ద్వారా ప్రతి సంవత్సరం 24 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ ఎంపీపీ ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు ప్రముఖ వ్యాపారవేత్త గుడ్ల మోహనరావు,పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు,వైసీపీ రాష్ట్ర వాణిద్య విభాగ్ సంయుక్త కార్యదర్శి బండారు జై ప్రతాఫ్ కుమార్,కమిటీ చైర్మన్ బాడన సునీల్ వాణిజ్య విభాగం రాష్ట్ర కన్వీనర్ బండారు జై ప్రతాప్ వైస్ ఎంపీపీ వండన వెంకటరావు రాష్ట్ర మహిళా విభాగం జాయింట్ సెక్రెటరీ కూన రమణమ్మ,కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిళ్లన సూర్యారావు స్థానిక ఎంపీటీసీ వడగ పద్మావతి, తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

ప్రజా సమస్యల పరిష్కారానికే గడప గడపకు ప్రభుత్వం : స్పీకర్



విశాలాంధ్ర-పొందూరు : గ్రామాలలో ప్రజల యొక్క సమస్యలను నేరుగా తెలుసుకుని,వాటి పరిష్కారానికి కృషి చేయడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎంతగానో తోడ్పడుతుందని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. మండలంలో ప్రతి గ్రామాన్ని ఆదర్శవంతమైన గ్రామాలుగా అభివృద్ధి పరిచేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం గ్రామంలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు జరిగేలా చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. శనివారం పొందూరు మండలం కేశవదాసుపురం గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ క్యాడర్‌తో కలిసి గడపగడపకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే తమకు నేరుగా చెప్పాలని ప్రజలను కోరారు. గ్రామాల్లో అర్హతే ప్రామాణికంగా సాంకేతిక, వివక్ష పరమైన సమస్యలు తొలగించి సంక్షేమ పథకాలు అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ బడాన సునీల్ స్థానిక సర్పంచ్ మొకర శంకర్రావు ఉప సర్పంచ్ లింగాల చిరంజీవి ఎచ్చెర్ల రాజు మొకర జనార్ధన చింతపల్లి వెంకటరమణ గాదు రాజారావు గాదు రాము తదితర వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు, సచివాలయం సిబ్బంది, వాలంటీర్‌లు పాల్గొన్నారు

శ్రీకాకుళం జిల్లా అభివృద్ధిపై 'కూన' బహిరంగ చర్చకు రాగలరా..?

వైసీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్చార్జ్ చింతాడ రవికుమార్



విశాలాంధ్ర-ఆముదాలవలస : శ్రీకాకుళం జిల్లాకు గత 25 సంవత్సరాలలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు కూన రవికుమార్ సిద్ధమా అని వైఎస్ఆర్సిపి ప్రచార విభాగం జోనల్ ఇన్చార్జ్ చింతాడ రవి కుమార్ సవాల్ చేశారు. అందుకు సిద్ధమైతే తేదీలను పత్రికా ముఖంగా ప్రకటించాలని చింతాడ రవికుమార్ తెలిపారు. ఆమదాలవలసలో గల జగనన్న ప్రజా సేవా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కూన రవికుమార్ కళ్ళు ఉన్నా చూడలేని గుడ్డివాడని, జగన్మోహన్‌రెడ్డి ఉద్దానం ప్రాంతం దశాబ్దాల కల ఉపరితల తాగునీరు సౌకర్యం కల్పించడాన్ని చూడలేని తెలుగుదేశం పార్టీ నాయకులు లేనిపోని మాటలు మాట్లాడుతున్నా రన్నారు. ఉద్దాన ప్రాంత ప్రజలు దశాబ్దాలుగా కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని, వేలాది మంది అశు వులు బాశారని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా ఏడు వందల ఏభై కోట్లతో త్రాగునీటి సౌకర్యం కల్పించారని, ఈవ్యాధి నిర్మూలనకు సంబంధించి రెండు వందల పడకల కిడ్నీ రీసెర్చ్ ఆసుపత్రిని కట్టించారని తెలిపారు. ఈ కార్య క్రమాలన్నీ కూన రవికుమార్ కంటికి కనపడ లేదా అని రవికుమార్ ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు తన 14 సంవత్సరాల ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో శ్రీకాకుళం జిల్లాకు చేసింది శూన్యమని, చంద్రబాబు హయాంలో జరిగిన ఒక్క ప్రాజెక్టైనా కూన రవికుమార్ చుపించగలరా అని ప్రశ్నించారు. జిల్లాకు టీడీపీ చేసిందేమీ లేకపోవడంతో జగన్మోహన్‌రెడ్డి మీద అసత్య ప్రచారాలు చేస్తున్నారని, జగనన్న ప్రజల ఇష్టాలు తెలిసిన వ్యక్తి అని, చంద్రబాబు పెత్తందార్లకు కొమ్ము కాసే వ్యక్తి అని చింతాడ రవికుమార్ పునరుద్ఘాటించారు. కూన రవికుమార్‌కు దమ్ముంటే ఈ విషయాలపై చర్చించటానికి బహిరంగ వేదికపైకి చర్చకు రావాలని, అందుకు గల తేదీలను ప్రకటించాలని చింతాడ రవికుమార్ సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో దానేటి రామ్మోహన్, బొడ్డేపల్లి శ్రీనివాసరావు, సువ్వారి మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

సేవ చెయ్యాలనే ఆలోచనే మహాగొప్పది : అడ్వకేట్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోత తిరుమలరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : స్థానిక ఇందిరానగర్ కాలనీ వద్దగల ఖ్యాతి వృద్ధాశ్రమం సందు వయోవృద్ధులకు దుప్పట్లు, ఫల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగిందని నిర్వాహకురాలు డాక్టర్. ఆర్. శ్రావణి తెలిపారు. ఇందులోభాగంగా ముఖ్య అతిథిగా తిరుమల, గౌరవ అతిధులుగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష్యులు కొంక్యాన వేణుగోపాల్, కొంక్యాన గోవిందరాజులు ట్రస్ట్ అధ్యక్ష్యులు కొంక్యాన మురలీదర్ లు పాల్గొని మాట్లాడుతూ సేవచేయాలనె ఆలోచన మహాగొప్పదని, వృత్తి రీత్యా ఎవరి పనులలో వారు నిర్విరామంగావుంటూ సేవలుచెయ్యటం హర్షణీయమన్నారు. చలితీవ్రత రోజు రోజుకీ పెరుగుతుండటంతో ఒక మంచి ఆలోచనతో ఈ రోజు నగరంలో ఉండే అభాగ్యులకు, అలాగే ఖ్యాతి వృద్ధాశ్రమంలో వయో వృద్ధులకు, జీల్ ఫౌండేషన్, మదర్ హెల్పింగ్ సొసైటీ సమస్తల సహకారంతో దుప్పట్లు పంపిణీ చెయ్యటం ఆనందంగా ఉందన్నారు. వేణు, మురలీధర్ లు మాట్లాడుతూ గత మూడురోజులుగా జీల్ ఫౌండేషన్ జాడ సాయి, మదర్స్ హెల్పింగ్ సొసైటీ' డా. వైడి.ప్రదీప్ లు అన్నవితరన, దుప్పట్లు పంపినే కార్యక్రమాలు చేస్తున్నారని, ఇందుకు జర్నలిస్ట్ ఉర్లం. శివతేజ సహకారం మరవలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జేసీఐ గ్రీన్ సిటీ అధ్యక్ష్యురాలు మణిశర్మ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ. 10వేలు వితరణ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : కోటబొమ్మాళి మండల కేంద్రంలోగల తెలుగుదేశం కార్యాలయం అవరణలో పేదల కోసం ఏర్పాటుచేసిన అన్న క్యాంటీన్‌కు సంతబొమ్మాళి మండలం మరువాడ సర్పంచ్ సూరాడ ధనలక్ష్మి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి దాసురాజుల కుమార్తె సంధ్య పుట్టిన రోజు సందర్భంగా శనివారం రూ. 10వేలును వితరణగా అందజేశారు. తన పుట్టిరోజు సందర్భంగా పేదప్రజలకు రూ. 5లకే భోజనం అందించే నేపథ్యంలో రూ.10లును అందజేశానని ఆయన తెలిపారు. ఈ మొత్తాన్ని అన్నక్యాంటీను నిర్వాహకులు లాడి శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తర్ర రామక్రిష్ణ, టీడీపీ నాయకులు వెలమల కామేశ్వరరావు, కోరాడ పెద్దగోవింద, కోరాడ గోవిందరావు, గొందు లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

పరిహారం నిధులు విడుదల

జగనన్న చిత్రపటానికి వంశధార నిర్వాసితుల పాలాభిషేకం

విశాలాంధ్ర-కొత్తూరు : వంశధార ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు, ఇల్లు కోల్పోయిన నిర్వాసిత కుటుంబలకు వైసీపీ ప్రభుత్వం ప్రకటించిన అదనపు పరిహారం పెండింగ్ నిధులు విడుదల చేసినందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి విగ్రహానికి ప్రాజెక్ట్ నిర్వసితులు శనివారం పాలాభిషేకం చేశారు. మండలం మెట్టూరు కేంద్రంలో వైస్ ఎంపీపీ, వైసీపీ సీనియర్ నాయుకులు లోతుగెడ్డ తులసి వరప్రసాధ్‌రావు ఆధ్వర్యంలో నిర్వాసితులు కృతజ్ఞత సభ నిర్వహించారు వైసీపీ ప్రభుత్వం నిర్వాసితులకు అదనపు పరిహారం ఇస్తామని హామీ ఇచ్చింది, ఏడాదీ కృతం 260 కోట్లు రూపాయలు విడుదల చేసుంది కొంత నిధులు. 70 కోట్లు రూపాయిలు పెండింగ్‌లో ఉండిపోయాయి. ఎప్పటినుండో ఈ నిధులు విడుదల చెయ్యాలని నిర్వాసితులు ప్రభుత్వాన్ని పలుమార్లు కోరారు రెండు రోజులక్రితం పలాస పర్యటనకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితుల డిమాండ్ ఆయన దృష్టికి వెళ్లగా వెంటనే నిర్వాసితులకు చెలించవలసిన పెండింగ్ నిధులు విడుదల అయినాయి. ఈ కార్యక్రమంలో పలువురు నిర్వాసితుల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ షేక్ బాజ్జీ మృతికి సంతాపం

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : పీడీఎఫ్ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ షేక్ బాజ్జి శుక్రవారం రోడ్డు ప్రమాధంలో మృతిచెందడంతో ఆయన మృతికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం అవరణలో జనసేన నాయకులతో కలిసి అంగన్వాడీలు సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మృతికి సంతాపంగా రెండు నిముషాలు మౌనం పాటించి ఆయన ఆత్మకుశాంతి కలగాలని మౌనం వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు హనుమంతు ఈశ్వరరావు, దుంపల సుదర్శన, టిడిపి నాయకులు తర్ర రామక్రిష్ణ, వెలమల కామేశ్వరరావు, పూజారి శైలజ, బెండి అన్నపూర్ణ, దేవాది సింహాద్రి, ఎస్.శ్రీనివాస్, కర్రి అప్పారావు, గొందు లక్ష్మణరావు, పట్ట సింహాచలం, జనసేన నాయకులు, అంగన్వాడీ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కాశీబుగ్గ : ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ షేక్ బాజ్జి రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందడం ఉపాధ్యాయ ఉద్యమానికి తీరని లోటని సమగ్ర శిక్షణ ఎం.ఐ.ఎస్ కోఆర్డినేటర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, సంఘం వ్యవస్థాపకుడు పి.బాలరాజు అన్నారు. శనివారం కాశీబుగ్గ విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఎమ్మెల్సీ షేక్ సాజ్జి మృతి పట్ల ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యుటిఎఫ్ సంఘాన్ని అగ్ర పథంలో నడిపి, ఉపాధ్యాయ లోకంలో ఆశాదీపంగా వెలిగిన వ్యక్తి షేక్ సాజ్జి అని కొనియాడారు. సమస్య సాధకుడు, నీతి నిజాయితీ నిబద్ధత కలిగిన ఒక గొప్ప నాయకుడుని కోల్పోయామని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.మురళీకృష్ణ ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎస్.గౌరీశంకర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

విశాలాంధ్ర-పలాస : విద్యార్థుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటలం చేస్తామన ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.రవి అన్నారు. శనివారం కాశీబుగ్గలో ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.రవి ఆధ్వర్యంలో పలాస మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవం ఎన్నుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని, 117 జీవోను రద్దు చేసి 3,4,5 తరగతులను విలీనం విరమించుకోవాలని అన్నారు. మండలంలో అనేక హాస్టళ్లల్లో మౌలిక సదుపాయాలు కరువై విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే అధికారులు స్పందించి హాస్టళ్లల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నూతనంగా ఎన్నికైన మండల అధ్యక్షుడు సాయి, మండల కార్యదర్శిగా కుప్ప సూర్య, ఉపాధ్యక్షులు దను, జీవన్, జశ్వంత్‌లు పాల్గొన్నారు.

బొరివంకలో మండల స్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన

విశాలాంధ్ర-కవిటి : మండలంలోని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి విద్య వైజ్ఞానిక ప్రదర్శన ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు 65 రకాల ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో గ్రూపు విభాగం నందు సెన్సార్ బోటెడ్ రైల్వే బ్రిడ్జి ప్రాజెక్టును రాజపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు అభిషేక్ రామ్, చరణ్ ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు.సింగిల్ విభాగంలో హైడ్రానిక్ ట్రాఫిక్ రెడక్షన్ సిస్టం ప్రాజెక్ట్ ను బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఆర్ జీవన్ కుమార్ ఏర్పాటు చేయగా ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాస్థాయికి ఎంపికైంది.కుసుంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గ్రూపు విభాగంలో యాసిడ్ రైన్ ప్రాజెక్టును ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టు ద్వితీయ స్థానం కైవసం చేసుకుంది. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు వ్యక్తిగత విభాగంలో మిల్లెట్స్ ఫర్ హెల్త్ లైఫ్ ప్రాజెక్ట్ ద్వితీయ స్థానం పొందారు.ఉపాధ్యాయ విభాగంలో ఇద్దివానీపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం మురళీకృష్ణ చే రూపొందించిన డయాబెటిస్ కంట్రోల్ ప్రాజెక్టు జిల్లా స్థాయికి ఎంపికైంది.ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలుగా ప్రమోద్ కుమార్ పాడి,టి రవి,ఈ వేణుగోపాల్,ఈ తవిటి నాయుడు వ్యవహరించారు.అనంతరం విజేతలకు ప్రధానోపాధ్యాయుడు ఎస్ రామకృష్ణ,ఎంపీటీసీ సభ్యులు దుద్ది సతీష్ కుమార్,విద్యా కమిటీ చైర్మన్ బొనమాలి మజ్జి చేతులమీదుగా బహుమతులు అందజేశారు.

జిల్లా మహిళా కమిటీ సెక్రటరీగా తిరుమల మానస

విశాలాంధ్ర-రణస్థలం : మండలంలోని వల్లభరావుపేట గ్రామానికి చెందిన గురాన తిరుమల మానస జిల్లా మహిళా విభాగం కమిటీ జనరల్ సెక్రటరీగా నియమితులయ్యారు. ఈమె గత కొంతకాలంగా రణస్థలం మండలం వైసీపీ మహిళా అధ్యక్షురాలుగా కొనసాగుతూ ఉన్నారు. తిరుమల మానస మాట్లాడుతూ ఈఅవకాశం ఇచ్చిన ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, యంపిపీ పిన్నింటి సాయికుమార్‌లకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం తిరుమల మానస కి స్థానిక నాయకులు అబినందలు తెలిపారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలో సిరిపురం

విశాలాంధ్ర-హిరమండలం : హిరమండలంలో మండలఫాస్టర్స్ సంఘం సమక్షంలో క్రిస్మస్ నెల సందర్భంగా సత్య సాయి కళ్యాణ మండపంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిపురం తేజేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని కేక్ కట్ చేసి అందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. కుల మతాలకు అతీతంగా ప్రజలు అంతా కలిసి మెలసి ఐక్యమత్యం గా జీవించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ఫాస్టర్స్ పడాలరవి, పడాల అంబేద్కర్, కె.శ్రీధర్, శ్రీను,పనుకు సూర్యనారాయణ, తూలుగు కృష్ణ, దారపు గోవింద నాయుడు, మామిడి చినబాబు, పడాల తిరుపతిరావు, రోనంకి చంద్రయ్య మరియు మిత్రబృంద సభ్యులు పాల్గొన్నారు.

హామీలు అమలుచేయమంటే అణచివేతలా?

- టెక్కలి జనసేన నాయకులు పల్లి కోటేశ్వరరావు
- అంగన్వాడి కార్యకర్తలకు అండగా జనసేన పార్టీ

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : అంగన్వాడీ కార్యకర్తలు ఇచ్చిన హామీలు అమలు చేయమని నిరసన వ్యక్తం చేస్తే అణచివేత చర్యలకు పూనుకోవడం మంచిది కాదని టెక్కలి నియోజక వర్గ జనసేన నాయకులు పల్లి కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హక్కులు సాధన, ఇచ్చిన హామీల కోసం పోరాడుతున్న అంగన్వాడీ కార్యకర్తలకు జనసేన పార్టీ పూర్తి మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత, పదవి విరమణ ప్రయోజనాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నేడు ఆ హామీలను నిలుపుకోకపోవడం అన్యాయమన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు తమ సమస్యలను పరిష్కరించాలంటూ స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ సంఘం నాయకురాలు దుంపల సుదర్శన, సిఐటియు జిల్లా నాయకులు హనుమంతు ఈశ్వరరావుల ఆధ్వర్యంలో నిరసన తెలుపుతన్న అంగన్వాడీలకు తోడుగ జనసేన పార్టీ నాయకులు నిరసన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ అంగనవాడి కార్యకర్తలు నిరసన ఆందోళన చేస్తుంటే అణచివేత చర్యలకు పూనుకోవడం అన్యాయమన్నారు. వెంటనే అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని మినీ

సెంటర్లు మెయిన్ సెంటర్‌లగా ఏర్పాటు చేయాలని, జీతాలు పెంచాలని, కూరగాయల బిల్లులు చెల్లించాలని అనేక సమస్యలపై డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన సైనికులు ప్రసాద్, వినోద్, సాయి, చందు, చిరంజీవి, సురేష్, శ్రీను, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి ఆడబిడ్డల ఉసురు తగులుతుంది

అంగన్వాడీ ఉద్యోగుల ధర్నాకు మద్దతు తెలిపిన టిడిపి శ్రేణులు

విశాలాంధ్ర-కోటబొమ్మాళి : చరిత్రలో ఎప్పుడు లేనివిధంగా సమస్యలపై ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేస్తున్న తెలుగింటి ఆడపడుచుల సమస్యలు తీర్చకపోగ వారికి వ్యతిరేఖంగా చర్యలు చేపట్టిన ఆడబిడ్డల కంటనీరు పెట్టిస్తున్న వైసిపి ప్రభుత్వానికి ఆడబిడ్డల ఉసురు తగులు తుందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల టిడిపి అధ్యక్షుడు బోయిన రమేష్ విమర్శించారు. స్థానిక ఐడీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగ న్వాడి టీచర్స్, హెల్పర్స్ సభ్యులకి తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు శనివారం కార్యక్రమంలో పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి హయాంలో రెండుసార్లు వేతన సవరణ చేయడమైనది అంగన్వాడీ కార్యకర్తలకి 4200 రూపాయల నుండి 7000 రూపాయలవరకు మొదటగా మరియు 7000 రూపాయల నుండి 10500 రూపాయల వరకు రెండోసారి పెంచడమైనది అంగన్వాడి హెల్పర్‌కి 2200 నుండి 4500 వరకు మొదటగా పెంచడమైనది 4500 నుండి

6000 రూపాయల వరకు రెండోసారి పెంచడం జరిగిందన్నారు. తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు ఎక్కువ వేతనం ఇస్తామని చెప్పిన ముఖ్యమంత్రి హామీని నెరవేర్చకపోవడం దురదృష్టకరమని 2022లోనే సుప్రీంకోర్టు అంగన్వాడీలకు గ్రాటివిటీ అమలు చేయాలని తీర్పునిచ్చిందని కానీ మన రాష్ట్రంలో అంగన్వాడీ లకి గ్రాట్యుటీ అమలు చేయడం లేదని రిటైర్డ్ అయిన సందర్భంలో నామినేల్ మొత్తం ఇవ్వటం వలన ఒంటరి మహిళలకు కుటుంబాలను లేనివాళ్ళు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల సంఘం నాయకురాలు దుంపల సుదర్శన, టెక్కలి నియోజక వర్గ తెలుగు యువత మహిళ అధ్యక్షురాలు పూజారి శైలజ, మాజీ ఎంపీపీలు తర్ర రామక్రిష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వర రావు, టిడిపి సీనియర్ నాయకులు గొందు లక్ష్మణరావు, ఎస్.శ్రీనివాస్, కర్రి అప్పారావు, దేవాది సింహాద్రమ్మ, బెండి అన్నపూర్ణ, పట్ట సింహాచలం టీడీపీ కుటుంబ సభ్యులు, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అధికారులే ఇంటికి పోతారు : అంగన్వాడీ కార్యకర్తలు సమ్మెలో పాల్గొన్న కాలంలో వైసీపీ ప్రభుత్వ చరిత్రలోని విధంగా సచివాలయ సిబ్బందితో కేంద్రాలు తాళాలు పగలుగొట్టి కేంద్రాలు తెరిపించటం వలన రేపు అధికారులే ఇళ్లకు పోతారని సిఐటియు జిల్లా నాయకులు హనుమంతు ఈశ్వరరావు హెచ్చరించారు. కోటబొమ్మాళి అంగన్వాడీ నిరసన శిభిరంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి సంఘటనలపై కోర్టును ఆశ్రయించనున్నామని కేంద్రాల తాళాలు పగలుగొట్టే అధికారం ఎవ్వరు ఇచ్చారని, అధికార పార్టీ నేతలు వారు చెప్పిందే వేదం, చేసిందే శాసనం అన్న చందాన వ్యవహరిస్తున్నారని ఇది ఎంతకాలం చెల్లదని ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధిచెప్పే సమయం అసన్నమైందని ఆయన అన్నారు.

కిడ్నీ ఆసుపత్రిపై 'వజ్జ'కు మాట్లాడే అర్హత లేదు

టిడిపి, జనసేన నేతలపై వైసిపి నేతల ఆగ్రహం
ఆదుకున్న ప్రభుత్వం ఏదో ప్రజల మధ్య చర్చకు సిద్దమా...!

విశాలాంధ్ర-పలాస : ఉద్దానం లో రెండు దశాబ్దాలుగా ప్రజలను బలి తీసుకుంటున్న కిడ్నీ మహమ్మారిని కూకటివేళ్ళు తో పెకిలించేందుకు వైయస్సార్ కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, వైయస్సార్ సుజల ధార ప్రాజెక్టులను 785 కోట్ల రూపాయలతో నిర్మాణం జరిపి వైసీపీ ప్రభుత్వం ప్రజలకు అంకితం చేసిందని ఈ అభివృద్ధిని ఉద్దానంతో పాటు జిల్లా ప్రజలు కొనియాడుతుంటే పలాస నియోజకవర్గం తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు కళ్ళు ఉన్న కబోదుల్లా మాట్లాడుతున్నారని పలాస మండలం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమాలపై ప్రజలను తప్పుదోవ పట్టించే టిడిపి జనసేన నాయకుల ప్రకటనలను శనివారం టెక్కలి పట్టణంలో జరిగిన విలేకరుల సమావేశంలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా పలాస మండల పరిషత్ అధ్యక్షురాలు ఉంగ ప్రవీణ, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పైల చిట్టి మాట్లాడుతూ ప్రకటనలు చేయడం కాదని, ప్రజల మధ్యకు వస్తే కిడ్నీ బాధిత కుటుంబాలను ఆదుకున్న ప్రభుత్వం ఏదో ప్రజలే చెబుతారని అన్నారు. టిడిపి జనసేన నాయకుల మాటలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధి తీవ్రత గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పలాస కు కిడ్నీ పరిశోధన కేంద్రం మంజూరు చేస్తే, దానిని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించిన అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ మౌనం దాల్చిన సంఘటన ఉద్దాన ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేరని అన్నారు. రెండు దశాబ్దాలుగా ఉద్దానంలో కిడ్నీ వ్యాధి ప్రబలుతుంటే సుదీర్ఘ కాలం పాటు ఈ ప్రాంతాన్ని పాలించిన గౌతు కుటుంబం ఎక్కడికెళ్ళింది అని ప్రశ్నించారు. శుద్ధ జలాలను రెండు రూపాయలకు అమ్ముకున్న చరిత్ర టిడిపిదని విమర్శించారు. నాలుగన్నరేళ్ళలో శంకుస్థాపనతో పాటు ప్రారంభోత్సవంచేసి ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు, శుద్ధజలం అందించేందుకు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం

చేసిన కృషిని కొనియాడారు. నాలుగున్నరేళ్లలో రెండేళ్లు కోవిడ్‌తో అభివృద్ధి పనులకు ఇబ్బంది ఉన్నప్పటికీ పట్టువదలని విక్రమార్కుడు లా రాష్ట్ర మంత్రి డాక్టర్ సిదిరి అప్పలరాజు చేసిన కృషి ఎలాంటిదో పలాస నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లిన అక్కడ ప్రజలు చెబుతారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని జీర్ణించుకోలేక కడుపు మంటతో టిడిపి జనసేన నాయకులు మాట్లాడుతున్నారని ఇది తగదన్నారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ప్రారంభోత్సవాలను విమర్శించే స్థాయి అర్హత టిడిపి జనసేన నాయకులకు లేదని ప్రధానంగా ప్రధానంగా వజ్జ బాబురావుకి లేదన్నారు. ప్యాకేజీలకు అమ్ముడుపోయిన జనసేన నాయకులు ప్రజా విశ్వాసం కోల్పోయిన వారిని, జనసేన జెండాలు వదిలి సైకిల్ జెండాలు పట్టుకోవాలని ఆ నాయకులకు .సూచించారు. ఇలాంటి దిగజారుడు విమర్శలు మానుకోవాలని, లేకుంటే ప్రజలు గౌతు కుటుంబంతో పాటు జనసేన ను కూడా వెలివేస్తారని హితవు పలికారు. సమావేశంలో జడ్పిటిసి ప్రతినిధి మచ్చ ధనరాజ్, దువ్వాడ రవి అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధన రావు, చింతాడ మాధవరావు, సర్పంచ్ ల సంఘ అధ్యక్షులు సంతోష్, బొడ్డపాడు సర్పంచ్ మదన్, సూర్య, షణ్ముఖరావు, మోహన్, రామ్ నరేష్ పాల్గొన్నారు.

లక్కవరం గ్రామంలో పంటకోత ప్రయోగం

విశాలాంధ్ర-సోంపేట : మండలం పలాసపురం యూనిట్ పరిధి లక్కవరం గ్రామానికి చెందిన రైతు గార భీమారావు వరి క్షేత్రంలో పంటకోత ప్రయోగాన్ని ప్రకృతి వ్యవసాయ అధికారులు శనివారం చేపట్టారు. భీమారావు ప్రకృతి వ్యవసాయ విధానాలు పాటిస్తూ వరి పంటను సాగు చేశారు. ఈయన క్షేత్రంలో పంట కోత ప్రయోగం చేయగా 5×5 మీటర్ల విస్తీర్ణంలో 13 కిలోల 280 గ్రాముల దిగుబడి వచ్చింది. ఎకరాకు 26 బస్తాలు దిగుబడి వచ్చినటుల ప్రకృతి వ్యవసాయ సిబబంది, మండల యాంకర్ కుమారి, మెంటర్ సత్యన్నారాయణ తెలిపారు. ఐసిఆర్‌పిలు, రైతు గార అప్పన్న ఉన్నారు.

వంద రోజులు పనిదినాలు కల్పించాలి

విశాలాంధ్ర-కవిటి : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ వేతనదారులకు వంద రోజులు పని దినాలు కల్పించాలని ఏపీడి శ్రీనివాసరెడ్డి క్షేత్రస్థాయి సిబ్బంది సూచించారు. ఈమేరకు శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం మండల మహిళా సమైక్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీడి శ్రీనివాస్ రెడ్డ మాట్లాడుతూ హౌసింగ్ నిర్మాణ పనులు,నీటి కుంటలు పనులు వేగవంతం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో భాస్కరరావు,ఈసీ ఎన్. నీలాంబర్,టి ఏ లు,ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఫిట్ ఇండియా బహుమతులు అందుకున్న విద్యార్థులు

విశాలాంధ్ర-కవిటి:మండలంలోని బి.గొనపపుట్టుగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వివిధ రకాలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు యోగ,డ్రాయింగ్, వ్యాస రచన పోటీలతో పాటు వివిధ వ్యాయామ కార్యక్రమాలపై విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయ రమేష్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఖగేశ్వరరావు అధ్యక్షతన చేపట్టిన సమావేశంలో విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు ఖగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకున్న నాడు అన్ని రంగాలలో ఉన్నత శిఖరాలు అధిరోహించగలరని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ హెచ్ఎం బాబురావు, ఉపాధ్యాయులు భవాని, పి ప్రసాద్, వైకుంఠరావు, జానకి, జ్యోత్స్న, కూర గౌడు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళింగాంధ్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షులుగా సనపల రామకృష్ణ

విశాలాంధ్ర- శ్రీకాకుళం టౌన్: కళింగాంధ్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షులుగా సనపల రామకృష్ణ ఎన్నికయ్యారు. శ్రీకాకుళం జిల్లాలో సామాజిక సమాజ సేవా కార్యక్రమాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందిన కళింగాంధ్ర యూత్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక ప్రక్రియ జరిగింది. ఈ ఎన్నికల్లో నూతన అధ్యక్షులుగా ఆముదాలవలస మండలం చీమలవలస గ్రామానికి చెందిన సనపల రామకృష్ణ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పైడి నవీన్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2023-24 సంవత్సరానికి గాను అసోసియేషన్ జిల్లా అధ్యక్షులుగా సనపల రామకృష్ణ బాధ్యతలు స్వీకరించినట్లు వెల్లడించారు. ఈయన గత పదేళ్లుగా సమాజ సేవలో పాల్గొంటూ 2019లో కళింగాంధ్ర యూత్ అసోసియేషన్ ఆవిర్భావం నుండి అసోసియేషన్ లో కీలకంగా వ్యవహరిస్తూ అనేక కార్యక్రమాలను ముందుండి విజయవంతం చేశారు. అందుకుగాను వ్యవస్థాపక అధ్యక్షులు పైడి నవీన్ కుమార్ 2023-24 సంవత్సరానికి గాను ఇప్పటివరకు అసోసియేషన్ ఉపాధ్యక్షులుగా ఉన్న రామకృష్ణకు జిల్లా అధ్యక్షుడు పదవిని సభ్యుల అందరి ఏకగ్రీవ ఆమోదంతో అందజేశారు. అసోసియేషన్ ప్రధాకార్యదర్శి కొత్తకోట శ్రీహరి మాస్టర్, ఎన్ ఆర్ ఐ వింగ్ అధ్యక్షులుగా పేడాడ అమర్ దీప్, ఉపాధ్యక్షులుగా సి హెచ్ సత్యనారాయణ , కోశాధికారిగా కూన శ్రావణ్, మీడియా కన్వీనర్ గా సీపాన రమేష్ కుమార్ తో పాటు పలువురుని సభ్యులుగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పైడి నవీన్ ప్రకటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ తనకిచ్చిన బాధ్యతలు సక్రమంగా నిర్వర్తిస్తూ సమాజంలో ఉన్న రుగ్మతలను పారద్రోలేందుకు, అదేవిధంగా వివిధ వర్గాల నిరుపేదలకు అండగా నిలిచేందుకు కృషి చేయునట్లు స్పష్టం చేశారు. కళింగాంధ్ర యూత్ అసోసియేషన్ లో ఉన్న సభ్యులందరూ నిస్వార్థంగా సమాజం కోసం సేవ చేసేవారిని ఆయన తెలిపారు. రామకృష్ణ ఎన్నిక పట్ల అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

మళ్ళీ సీఎం జగనన్నే : ఎమ్మెల్యే శాంతి

విశాలాంధ్ర-హిరమండలం : వంశధార నిర్వాశితులకు ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇంకా అందని అదనపు పరిహారం నిర్వాసి తులకు శుక్రవారం ఉదయం 43.98 కోట్ల రూపాయలు జమ చేయడంతో శనివారం ఉదయం మండలంలోని శుభలయ ఆర్‌అండ్‌ఆర్ కమ్యూనిటీ హాల్‌లో పాతపట్నం నియోజకవర్గశాసన సభ్యురాలు రెడ్డి శాంతి నిర్వాసితులతో ఆనందం పంచుకున్నారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే రెడ్డి శాంతి మాట్లాడు సీఎం జగనన్న నిర్వాసి తులత్యాగం వెల కట్టలేమని అదనపు పరిహారం సీఎం అయిన వెంటనే అంద జెస్తానని 216.71 కోట్లు రూపాయలు మంజూరు చేయడం జరిగిందని అయితే కొంతమంది నిర్వశితులు నివేదిక జాప్యం చేయడంతో 30 శాతం మందికి అందకపోవడం జరిగిందని, ఇంకాఅదనపు పరిహారం అందుకొని వారు ఉన్నారని తెలపడంతో నిదులు విడుదల చేసారని ఎమ్మెల్యే అన్నారు. ప్రపంచంలో నే ఇలాంటి సీఎం దొరకడని మన రాష్ట్ర ప్రజలు అదృష్టం జగనన్న సీఎం గా ఉండడం మళ్ళీ మళ్ళీ ఫ్యాన్ గుర్తు కే ఓటు వేసి ఎమ్మెల్యేగా నన్ను సీఎంగా జగనన్న ను గెలిపించాలని పిలుపు నిచ్చారు..ఈసందర్బంగా సీఎం జగన్ చిత్ర పటానికి ఎమ్మెల్యే శాంతి నిర్వాసి తులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట మండలవైసీపీ అధ్యక్షులు మీసాల రామకృష్ణ, జెసిఎస్ మండలకన్వీనర్ అందవరం సురేష్,, తహసీల్దార్ బి.మురళిమోహన్, సర్పంచ్‌లు డిసుందరమ్మ, వంజరావు చిరంజీవి, గడియాసుదీర్, నక్క ఆనంద్, పి సింహచలం, నిర్వశిత మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రపుష్కరిణి అభివృద్ధి పనులకు కృష్ణదాస్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర-నరసన్నపేట : అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఇంద్ర పుష్కరిణి అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే, ధర్మాన కృష్ణదాస్‌కు ఆహ్వానం అందింది. ఈ విషయమై శనివారం మబగాం గ్రామానికి అరసవల్లి ఆలయ అధికారులు కృష్ణదాస్‌ను కలిసి, ఈ నెల 20వ తేదీన ఇంద్రపుష్కరిణి అభివృద్ధి పనులు ప్రారంభిస్తామని, ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని కోరారు.

ఘనంగా వాగ్దేవి విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-నరసన్నపేట : పోలాకి మండలంలోని మబగాం గ్రామంలో శనివారం శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో శ్రీ వాగ్దేవి అమ్మవారి విగ్రహం ప్రతిష్టా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, ధర్మాన కృష్ణదాస్, జెడ్పీటిసి, డా.ధర్మాన కృష్ణచైతన్య హాజరై, అమ్మవారికి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులతో పాటు నరసన్నపేట పిఏసియస్ అధ్యక్షులు, పొన్నాన దాలినాయుడు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దివ్యాంగ వృద్దునకు చేతికర్రను వితరణ చేసిన లయన్ డా. మిశ్రో

విశాలాంధ్ర-ఎల్ఎన్‌పేట : లక్ష్మీనర్సుపేట గ్రామంలో అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్ వైస్ ప్రెసిడెంట్, దివ్యాంగ ఉద్యోగ సంఘం రాష్ట్ర నాయకుడు, సక్షం జిల్లా కన్వీనర్, సీఫ్ జిల్లా ఎగ్జికూటివ్ మెంబర్, మానవతా సేవా ఆర్గనైజేషన్ జిల్లా మెంబర్ లయన్ డా॥ఎం.కె.మిశ్రో లక్ష్మీనర్సుపేట గ్రామంలో గల రాధాకృష్ణ పాణిగ్రాహి 80సం॥ అనే చెవిటి, మూగ దివ్యాంగునకు చేతికర్రను వితరణ చేశారు. ఈ సందర్భంగా మిశ్రో మాట్లాడుతూ దివ్యాంగులను ప్రభుత్వంతో పాటు స్వచంధ సంస్థలు మరియు దాతలు కూడా తోడ్పాటు అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ అశోక్ పాణిగ్రాహి, ప్రధానోపాధ్యాయుడు జి.ఎం.పాత్రో, ఉపాధ్యాయుడు టి.ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పెరటకోళ్ల పెంపకం వలన ఆదాయం పెంచుకోవచ్చు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : పెరటకోళ్ల పెంపకంతో ఆదాయం పెంచుకోవచ్చని ఎంపిపి ప్రతినిధి ఉదయ్‌కుమార్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిర పడాలనే ఉద్దేశంతో వెలుగు కార్యాలయం వద్ద సంఘం ద్వారా సుమారు 50 యూనిట్ల కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. పేరటకోళ్ల ద్వారా ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో ఎపిఎం జాంబవతి, మంగమ్మ, మండల సమైఖ్య అధ్యక్షురాలు జల్లు ఉషారాణి, వైసీపీ నాయకులు బమ్మిడి మోహనరావులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు జనసేన సంఘీభావం

విశాలాంధ్ర-సోంపేట : సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్న సోంపేట అంగన్వాడీలకు శనివారం జనసేన పార్టీ నేతలు సంఘీభావం తెలిపారు. సమ్మె శిబిరం వద్దకు హాజరై అంగన్వాడీలతో మాట్లాడారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోవడం దురదృష్టకరమని అన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, సూచనలు సైతం ఏమాత్రం ఖాతరు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జనసేన నేతలు బైపల్లి ఈశ్వరరావు, బీన ప్రదీప్, చందు, సంతోష్, హర్ష, రవి, చిరంజీవి, గున్నయ్య తదితరులు పాల్గొన్నారు.